క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మ వారోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమునిపట్నం: భీమిలిలో నాగవంశీయుల ఆరాధ్య దైవం మరిడమ్మ వారి వారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు, నాగవంశ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాళ్ల రవి శంకర్ తన తాతయ్య కాళ్ల అప్పలస్వామి జ్ఞాపకార్థం రూ. 1.25 లక్షల విలువ గల నాలుగు వెండి గాజులను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కులపెద్దలు సంకురుభుక్త సూరిబాబు, కాళ్ల శ్రీనివాస్, సంకురుభుక్త జోగారావు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు



బోరు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట గ్రామదేవత ఎర్నిమాంబ ఆలయం వద్ద బోరు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు ఇక్కడ బోరు ఏర్పాటు చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు చిన్నారావు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

మధురవాడ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాలలో భాగంగా స్వతంత్రనగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాయత్రి మెడికల్ కళాశాల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యండ అప్పారావు, డాక్టర్ సెల్ కన్వీనర్ డాక్టర్ రవికిషోర్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పైడిరాజు, మైనార్టీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాలువపై గట్టు ఎక్కి ఉండిపోయిన కారు

భీమునిపట్నం: భీమిలి–తగరపువలస రోడ్డు కాలువపై ఉన్న కల్వర్టు గట్టుపైకి ఒక కారు ప్రమాదవశాత్తు ఎక్కింది. అయితే, కారు గట్టుపైనే ఉండిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. వివరాలివి.. ఇక్కడ జమ్మిచెరువు పార్కు సమీపంలో ప్రధాన మురుగునీటి కాలువపై కల్వర్టు గట్టు ఉంది. అయితే, ఎప్పుడు జరిగిందో.. ఒక కారు రివర్స్ చేస్తున్న క్రమంలో వేగంగా వెనక్కి వెళ్తూ గట్టును బలంగా ఢీకొట్టినట్టు తెలుస్తోంది. దీంతో వెనుక కుడివైపు చక్రం ఊడిపోయింది, కానీ అదృష్టవశాత్తు కారు కాలువలో పడకుండా గట్టుమీదే ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈకారు ఎవరిది, ఎక్కడివారు అన్న వివరాలు తెలియలేదు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పీఎం పాలెం: దసరా ఉత్సవాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో మంగళవారం సాయంత్రం 6గంటలకు ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని సరస్వతీ నృత్య కళా మందిర్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారి కళాకారులు తమ నృత్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కె.సరస్వతి నృత్య దర్శకత్వంలో చిన్నారులు చక్కని ప్రతిభను కనబరిచారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రమాదమని తెలిసీ..
రోడ్డుపై తప్పని నిరీక్షణ

- ప్రమాదకరంగా వేములవలస జంక్షన్
- ఫుట్‌పాత్‌లపై దుకాణాలు.. రోడ్డుపై ప్రయాణికులు
- ప్రతిరోజూ కొత్తగా పుట్టుకొస్తున్న దుకాణాలు, కంటెయినర్లు
- పట్టించుకోని అధికారులు

ఒకవైపు రద్దీగా ఉండే మార్కెట్.. మరోవైపు ఫుట్‌పాత్‌లపై దుకాణాలు .. రోడ్డుపై వందలాది మంది ప్రయాణికులు .. వేగంగా వచ్చే వాహనాలు.. ఈ గందరగోళంలో వేముల వలస కూడలిని చూస్తే ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉంటుంది. ఫ్లై ఓవర్ కింద ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణల్లో ఉండటంతో ప్రయాణికులు మలుపుల వద్ద రోడ్డు మీదే గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో అన్నట్లు ఉంటుంది అక్కడి పరిస్థితి..



వేములవలస కూడలిలో ఫ్లై ఓవర్ కింద వేచి ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు

తగరపువలస: ఏడేళ్ల క్రితం జరిగిన జాతీయ రహదారుల విస్తరణ ఆనందపురం మండలం వేములవలస ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఇక్కడ కూడలి నిత్యం పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. గతంలో విశాఖ వైపు నుంచి తగరపువలస వైపు వచ్చే వాహనాలు నేరుగా జాతీయరహదారి మీదుగా వెళ్లేవి. కేవలం పెందుర్తి, అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు మాత్రమే వేములవలస కూడలి మీదుగా వెళ్లేవి. జాతీయ రహదారుల విస్తరణ సమయంలో విశాఖ–తగరపువలస జాతీయరహదారి మార్గాన్ని మూసివేసి, వేములవలస కూడలి మీదుగా మళ్లిస్తున్నారు. ఈ కూడలిని ఆనుకుని ఉన్న మార్కెట్ కారణంగా నిత్యం వేలాది మంది



ఫ్లై ఓవర్ కింద కంటైనర్‌లతో ఆక్రమణ



వేములవలస ఫ్లై ఓవర్ కింద ప్రారంభానికి సిద్ధంగా దుకాణాలు

వినియోగదారులు, ప్రయాణికులు, విద్యార్థులు బస్ షెల్టర్లు లేని ఫ్లై ఓవర్ కింద గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించేయడంతో బస్సుల కోసం వీరంతా ప్రమాదకరమైన రహదారిపైనే ఉండవలసి వస్తోంది. దీంతో తరచూ ఈ కూడలిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పూర్వం వలె విశాఖ నుంచి వచ్చే వాహనాలను వేములవలస కూడలి మీదుగా కాకుండా ఫ్లై ఓవర్ మీదుగానే మళ్లించాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తున్న ఫుట్‌పాత్‌లు

వేములవలస కూడలిలో నలువైపులా వచ్చే వాహనాలను చూసి సామాన్య ప్రజలు ఈ ప్రాంతంలో తరచూ అయోమయానికి గురవుతుంటారు. వేములవలస కూడలిలో నలువైపులా ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించేశారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండేవారు ఈ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ల కింద రహదారిపై తలదాచుకోగా, పాదచారులు అదే మార్గంలో నడిచి వెళ్తుంటారు. ప్రస్తుతం ఇక్కడి ఫుట్‌పాత్‌లు టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. ఇప్పటికే తాత్కాలికంగా చిరు వ్యాపారులు వీటిపై వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటుండగా.. వాటిపై బడా వ్యాపారుల కన్ను కూడా పడింది. ఈ ప్రాంత టీడీపీ నాయకులను వ్యాపారులు నోట్ల కట్టలతో కొట్టి ప్రసన్నం చేసుకున్నారు. అంతే, వారు అభయం ఇవ్వడంతో రాత్రికి రాత్రి పలు కొత్త దుకాణాలు ఫ్లై ఓవర్ కింద ఫుట్‌పాత్‌లపై వెలిసి ప్రారంభోత్సవాలు జరుపుకొంటున్నాయి. ఇది ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలిగించే విషయం అయినా.. ఆనందపురం రెవెన్యూ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, జాతీయరహదారుల సంస్థ, వేములవలస పంచాయతీ అధికారులు అడ్డు చెప్పలేదు. దీంతో బడా దుకాణాలతో పాటు కంటైనర్లు వెలిశాయి. కంటైనర్లను గిడ్డంగులుగా, వస్తువుల తయారీ యూనిట్లుగా వినియోగించనున్నారు.

ఇటీవల గండిగుండం పంచాయితీ కోరమాండల్ పెయింట్స్ వద్ద ఫుట్‌పాత్‌పై



వేములవలస కూడలిలో పెందుర్తి వెళ్లే మార్గంలో ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

చిన్న టిఫిన్ దుకాణం నడుపుకొంటున్న మహిళ పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులకు వేములవలస ఫ్లై ఓవర్ కింద ఏర్పాటవుతున్న దుకాణాల వెనుక ప్రమాదాలు కనిపించకపోవడం శోచనీయం. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ఎలాంటి ముందు చూపు లేకుండా ఏర్పాటు చేస్తున్న దుకాణాల వలన భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఇక్కడి ఇబ్బందులపై కలెక్టర్ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తే ప్రస్తుతం జీవీఎంసీలో తొలగించినట్లే వీళ్లను కూడా రోడ్డున పడేస్తారని అంటున్నారు. అందువలన ప్రారంభ దశలోనే సంబంధిత అధికారులు స్పందించి, ఈ దుకాణాల ఏర్పాటు కారణంగా ఏదైనా ముప్పు ఉంటే అభ్యంతరం చెప్పాలని కోరుతున్నారు.



ఇస్కాన్‌లో రేపు రావణదహనం

కొమ్మాది: దసరా వేడుకల్లో భాగంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం రాత్రి 7 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రకటనలో తెలిపారు. 50 అడుగుల రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్స్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు ఉంటాయని తెలియజేశారు. ఆ రోజు ముందుగా మందిరంలో రాధాకృష్ణులను, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పీవో శ్రీదేవి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా నివాసం ఉంటున్న 21 నుంచి 35 ఏళ్లలోపు మహిళలు ఈ పోస్టుకు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో భీమిలి ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఖాళీల వివరాలు రిజర్వేషన్ కేటగిరీ ప్రకారం ఇలా ఉన్నాయి. బి.తాళ్లవలస–1(ఎస్టీ), వెల్లంకి(ఎస్టీ), లింగన్నపేట(ఎస్టీ), బాందేవపురం(ఎస్టీ), మద్ది–1(ఓసీ మహిళ)కు కేటాయించినట్లు వివరించారు.

ప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు



అయ్యప్ప ధ్యాన మందిరంలో సమావేశమైన సేవా సంఘ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని అయ్యప్ప ధ్యాన మందిరం వద్ద ప్రతి సంవత్సరంలాగే అన్న ప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు తెలిపారు. ధ్యాన మందిరం వద్ద మంగళవారం జరిగిన సేవా సంఘ కార్యవర్గ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని, అయ్యప్పస్వాములు, భవానీలు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుపై మొరాయించిన ఇసుక లారీ



చిట్టివలస సబ్‌స్టేషన్ ఎదురుగా సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోయిన ఇసుకలారీ

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా సర్వీస్‌రోడ్డుపై మంగళవారం వేకువజామున ఇసుక లారీ మొరాయించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. సంగివలస నుంచి తగరపువలస మీదుగా వెళ్లవలసిన లారీ రహదారి మధ్యలో నిలిచిపోవడంతో విశాఖ నుంచి తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం వెళ్లవలసిన సిటీ బస్సులు, ప్యాసింజర్ సర్వీసులు మళ్లీ వెనక్కు వెళ్లి సబ్బివానిపేట మీదుగా సర్వీస్‌రోడ్డులో వెళ్లి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మళ్లీ ఎడమవైపు మార్గంలోకి ప్రవేశించాయి. దీంతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వైపు వెళ్లే వాహనదారులకు ఆలస్యం అయింది.

రెక్కదోమల నివారణకు సైప్రోథిన్

తగరపువలస: జీవీఎంసీ మలేరియా నివారణ సిబ్బంది రెక్కల దోమల నివారణకు మంగళవారం చీకటి పడిన తరువాత సైప్రోథిన్ రసాయనాన్ని పొగరూపంలో పిచికారీ చేశారు. లార్వా నివారణకు డ్రైనేజీలలో వేసే రసాయనం వేరుగా ఉంటుందని, రెక్క దశలో దోమలు ఇళ్లలో ప్రవేశించే అవకాశం ఉన్నందున దీనిని చీకటి పడిన తరువాత వ్యాపింపచేస్తున్నట్టు తెలిపారు.

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో జీవీఎంసీ అధికారులు మంగళవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతాల్లో దోమలు అధికంగా ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ ఎస్.సూరిబాబు ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ నిర్వహించారు. 4వ వార్డులో కాపులుప్పాడ, కె.నగరపాలెం, నిడిగట్టు, జీవి అగ్రహారం ప్రాంతాల పరిధిలో అన్ని చోట్ల స్ప్రేయింగ్ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో అన్న సమారాధనలు



అల్లూరి సీతారామరాజు కాలనీలో అన్నదానం చేస్తున్న గురుభవాని లక్ష్మీపతిరాజు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం భీమిలి అర్బన్, రూరల్‌తో పాటు ఆనందపురం మండలంలోని పలు మండపాల వద్ద అన్న సమారాధనలు జరిగాయి. భీమిలి మండలం మజ్జివలస మండపం వద్ద జరిగిన అన్నసమారాధనలో వేలాది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. జీవీఎంసీ ఒకటోవార్డు కొండపేట దుర్గాంబికా ఆలయం, చిట్టివలస వాణీ విద్యానికేతన్ వద్ద మండపంలో నారాయణసేవ నిర్వహించారు. రెండోవార్డు జీరుపేట, వలందపేట, అల్లూరి సీతారామరాజు కాలనీల్లోనూ అన్నప్రసాదాల పంపిణీ జరిగింది. గురుభవాని లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పిన్నింటి వారి కళ్లాలు, ఎర్నమ్మ గుడి వద్ద మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో చెట్టుకు ఉరిపోసుకుని గుర్తు తెలియని వ్యక్తి వేలాడుతూ కనిపించాడు. పంచాయతీ సచివాలయ మహిళా పోలీసు బి.శ్యామల ఈ మేరకు ఆనందపురం సీఐ వాసునాయుడుకు సమాచారం అందించారు. మృతుని ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాలలో విచారించినా వివరాలు తెలియరాలేదు. ఆరెంజ్ షర్ట్, గ్రే కలర్ ప్యాంట్ ధరించిన మృతుని వయసు 45 నుంచి 55 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు లారీ డ్రైవర్ లేదా క్లీనర్ అయి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు.

18 నుంచి దీక్షాపరులకు నారాయణ సేవ



కరపత్రం విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట దుర్గాలమ్మ ఆలయం వద్ద ఈ నెల 18 నుంచి నవంబరు 27 వరకు 41 రోజుల పాటు స్వాములు, భవానీలు, ఇతర దీక్షాపరులకు నారాయణసేవ నిర్వహించనున్నారు. కార్యక్రమ కరపత్రాన్ని ఆలయంలో మంగళవారం విడుదల చేశారు. జగుపల్లి ప్రసాద్, దొంతల పైడిరాజు, వెంపాడ వెంకటరమణ, ఉప్పాడ అప్పలరెడ్డి, తమ్మిన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

- భీమిలి మండలం లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవాపీఠంలో ఈ నెల 22 నుంచి డిసెంబరు 1 వరకు 41 రోజుల పాటు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపక ధర్మకర్త గాడు తాతినాయుడు తెలిపారు.

141 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం పయనీర్ వైన్స్ నుంచి 24 కాలనీకి తరలిస్తున్న 141 మద్య బాటిళ్లను టాస్క్‌ఫోర్స్, ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు. శిర్లపాలెం, తర్లువాడ పంచాయతీలకు చెందిన కోరాడ శంకర్, మజ్జి సూరిబాబు అనే ఇద్దరు వ్యక్తులను ద్విచక్రవాహనాలపై రెండు కేస్‌లలో తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుకున్నారు. బాటిళ్లతో పాటు వీరిద్దరినీ ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

సమావేశ మందిరం ప్రారంభం

భీమునిపట్నం: భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన నూతన సమావేశ మందిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ నిధులు రూ.60 లక్షలు, హెచ్‌పీసీఎల్ నిధులు రూ.40 లక్షలతో ఈ హాల్‌ను నిర్మించారు. ఆయన మాట్లాడుతూ విశాలమైన ఈ సమావేశ మందిరం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హాల్ నిర్మాణానికి హెచ్‌పీసీఎల్ సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీడీవో నర్సింహరావు, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్, ఈవోఆర్‌డీ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రజాప్రతినిధుల ఆవేదన

తగరపువలస: భీమిలి ఎంపీడీవో కార్యాలయంలో రూ.కోటితో నిర్మించిన సమావేశ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం అధికారులు మరోమారు ప్రొటోకాల్ నిబంధనలు మరిచారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుచే ప్రారంభించబడిన ఈ కార్యక్రమంలో మండలంలోని వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, లక్ష్మీపురం, పెదనాగమయ్యపాలెం సర్పంచ్‌లు లచ్చుబుగత జగదీశ్వరరావు, బొడ్డు సత్తెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణకు సమాచారం లేదన్నారు. ఇలాంటి అధికార కార్యక్రమాలు జరిగే రెండు రోజుల ముందే సంబంధిత ప్రజాప్రతినిధులకు అధికారులు లిఖితపూర్వకంగా ఆహ్వానం పంపాల్సి ఉండగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారులు ఈ నిబంధనలను పాటించడం లేదన్నారు. వాస్తవానికి ఈ సమావేశ మందిర నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఆ సమయంలో వీటి కోసం పాటు పడిన ప్రజాప్రతినిధులు ఉండగా, అధికారులు పచ్చచొక్కాలు ధరించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బంగారునాయుడు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది దసరా మామూళ్ల వేటలో ఉండి ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. దీంతో మిగిలిన వారు కూడా ఈ ప్రారంభోత్సవానికి దూరంగా ఉన్నారు. ఫోన్ చేసినా ఎంపీడీవో నరసింహారావు లిఫ్ట్ చేయకపోవడంతో, ప్రొటోకాల్ ఉల్లంఘనపై మరోమారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లతామన్నారు.

శుభములనీయవే భవానీ..

- అమ్మవారిని భక్తితో అర్చించిన ప్రజలు
- వైభవంగా దుర్గాష్టమి పూజలు



దుర్గామాతగా భక్తులకు దర్శనం ఇచ్చిన దుర్గాలమ్మ

తగరపువలస: దుర్గాష్టమి వేళ అమ్మవారిని భక్తితో అర్చించారు భీమిలి నియోజకవర్గ వాసులు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి కుంకుమపూజలు, హోమాలు నిర్వహించారు. కలశాలు, జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు.

- సంగివలస ముగ్గురు అమ్మవార్లకు స్థానిక గొల్లపేట వాసులు సారె సమర్పించారు. ఈ ఆలయంలో రెండో రోజు కూడా దుర్గా హోమం నిర్వహించారు.
- బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారికి ఆలయ ట్రస్టీ రాజగిరి కుసుమహర ఆధ్వర్యంలో దుర్గా హోమం చేశారు. ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాల్లో సుమారు 200 మంది మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు.
- జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌లోని మండపం వద్ద గురుభవాని పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో భవానీలు అగ్నిగుండం తొక్కారు.



ముగ్గురు అమ్మవార్లకు సారె సమర్పిస్తున్న సంగివలస ప్రజలు

దుర్గాదేవిగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గా దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పసుపు, ఎరుపు వర్ణాల పుష్పాల మాలలు, ఎరుపు రంగు గాజులు ధరించారు. పంచదార పరమాన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. మహిళలు ఆలయ మండపంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలనుంచి శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

దుర్గాలమ్మ ఆలయంలో..

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. నిత్య పూజలు, లక్ష కుంకుమార్చన, సూర్య నమస్కారాలు, ఖడ్గ మాలా హోమం తదితర పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



బైపాస్‌రోడ్డు విజయదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న దుర్గా హోమం



బంటుపల్లి కళ్లాల్లో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బబ్బేలమ్మ ఆలయ మండపంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అవార్డు గ్రహీతకు అభినందన



అవార్డు అందుకుంటున్న లక్ష్మి

పద్మనాభం: ఏరువాక ఫౌండేషన్ రాష్ట్ర ఉత్తమ మహిళా రైతుగా 2023–24 సంవత్సరానికి అవార్డు అందుకున్న పద్మనాభం మండలం కోరాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మిని పలువురు అభినందించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్న లక్ష్మి సేవలను గుర్తిస్తూ గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో సెప్టెంబర్ 27వ తేదీన వర్సిటీ వీసీ రత్నాకర్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వ్యవసాయ అసోసియేట్ అధ్యక్షుడు దయాకర్ చేతులమీదుగా ఆమెకు ఈ అవార్డును బహూకరించారు. లక్ష్మి ప్రకృతి వ్యవసాయ విధానంలో 50 సెంట్ల విస్తీర్ణంలో 22 రకాల కూరగాయలు పండిస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తోంది.

సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఫస్టియర్ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. 10 పాయింట్లకు గాను బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీలో సరగడ జాగృతి 9.31, డి.సరస్వతి 9.23, బొండపల్లి అనురాధ 9.04, జీరు ప్రవల్లిక 9.0 పాయింట్లతో వరుసగా నాలుగు ర్యాంకులు సాధించారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో 9.0 పాయింట్లతో వెంకటేష్, బీకాం కంప్యూటర్స్‌లో 8.62 పాయింట్లతో ఎం.లావణ్య ప్రతిభ కనపరిచారు. వారిని విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జె.సతీష్, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా దేవర సంబరం

పద్మనాభం: కృష్ణాపురంలో సోమవారం రాత్రి బంగారమ్మ దేవర సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నుంచి సాము గరిడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరి పొలిమేరల్లోకి వెళ్లారు. అక్కడి నుంచి బంగారమ్మను ఆహ్వానించి, గ్రామంలోకి తీసుకువచ్చారు. గ్రామంలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు ఘటాలు తిరుగుతాయి. ఎనిమిదో తేదీన ముగింపు ఉత్సవం జరుగుతుంది.